నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, ఆదివారం 28 జనవరి 2024 | KARIMNAGAR

'కొండంత' జనం

మల్యాల, జనవరి 27: సమ్మక్క జాతర సమీపిస్తున్న నేపథ్యంలో శనివారం కొండగట్టు హనుమాన్ ఆలయం భక్తులతో పోటెత్తింది. సుమారు 25 మంది తరలి రావడంతో ఎటుచూసినా రద్దీ కనిపించింది. కొండపైకి చేరుకొనేందుకు 3 గంటల సమయం పట్టిందని ఆలయ అధికారులు వెల్లడించారు. వివిధ ఆర్జీత సేవల ద్వారా సుమారు ₹10 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఆలయ ఈవో టీ వెంకటేశం. పాలక మండలి చైర్మెన్ తిరుక్కోవళూర్ మారుతీస్వామీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా తాగునీటి సౌకర్యంలేక క్యూలైన్లలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పార్లమెంట్‌కు సన్నద్ధం

- ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా బీఆర్ఎస్
- వైఫల్యాలను ఎండగట్టి..వాస్తవాలను ముందుంచడమే లక్ష్యం
- శ్రేణులను కార్యోన్ముఖులను చేసేందుకు ప్రణాళిక
- సోషల్ మీడియా వారియర్స్ మీటింగ్ ఇప్పటికే పూర్తి
- నేడు సిరిసిల్ల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం
- దిశానిర్దేశం చేయనున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- త్వరలోనే మిగతా నియోజకవర్గాల్లో నిర్వహణ

సిరిసిల్లలో తెలంగాణ భవన్ ఎదుట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం కోసం చేసిన ఏర్పాట్లు

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పావులు కదుపుతున్నారు. అందు కోసం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఈ నెల 24న ఉమ్మడి జిల్లా సోషల్ మీడియా వారియర్స్ మీటింగ్‌ను నిర్వహించిన ఆయన, నేడు సిరిసిల్ల నియోజకవర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించబోతున్నారు. ఉమ్మడి జిల్లాలో సిరిసిల్లతో మొదలయ్యే ఈ సమావేశాలు.. అన్ని నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేసేందుకు అంతా సిద్ధం చేశారు. ఇతర పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ.. వాస్తవాలను ప్రజలకు తెలుపడంతో పాటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

కరీంనగర్, జనవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ రాజన్న సిరిసిల్ల (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్, అందుకు కసరత్తు ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో ఉన్న పార్టీ నాయకులను, కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసేందుకు ప్లాన్ సిద్ధం చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అతి స్వల్ప తేడాతో ఓట మి పొందిన ఆ పార్టీ.. అందుకు కారణాలను ఇప్పటికే అన్వేషించింది. తిరిగి ఆ పొరపాట్లు లోక్‌సభ ఎన్నికల్లో పునరావృతం కాకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నది. అసెం బ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్ష, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తల సలహాలు, సూచనలను స్వీకరించే లక్ష్యంతో శనివారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నది.

శ్రేణులను సన్నద్ధం చేసేలా..

అత్యధిక సభ్యత్వాలతో బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాలోనే ఏకైక పార్టీగా ఎదిగింది. ఒక్క సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాన్ని తీసుకుంటే.. గులాబీ పార్టీకి 1,03,075 మంది సభ్యత్వం ఉన్నది. 2021లో సభ్య త్వ కార్యక్రమం నిర్వహించినప్పుడు సిరిసిల్ల నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థాయిలో నిలిచింది. ఆనాటి లెక్కల ప్రకా రం చూస్తే.. సిరిసిల్ల టౌన్‌లో 36,275, ఎల్లారెడ్డిపేటలో 19,700, ముస్తాబాద్‌లో 14,950, గంభీరావుపేటలో 13,775, తంగళ్లపల్లిలో 13,750, వీర్నపల్లిలో 4,62 5 కలుపుకొని చూస్తే మొత్తం 1,03,075 మంది సభ్యత్వ సేకరణ జరిగింది. సిరిసిల్ల నియోజకవర్గ చరిత్రలోనే ఇంత సభ్యత్వమున్న పార్టీ ఇంకోటి లేదు. భవిష్యత్‌లోనూ ఉండే దాఖలాలు లేవు. అలాగే, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చూస్తే 13 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏడు లక్షల వరకు సభ్యత్వాలతో రికార్డు సృష్టించింది. గ్రామగ్రామాన పార్టీ బలంగా ఉన్నా.. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇతర పార్టీలు చేసిన అసత్య ప్రచారాలను తిప్పికొట్టే విషయంలో పార్టీ శ్రేణులు కొంత వెనుకబడిపోయాయి. దీంతో సోషల్ మీడియా వేదికగా విష ప్రచారాలతో ప్రజలను పక్కదారి పట్టించడంలో ఇతర పార్టీలు కొంత విజయం సాధించాయన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ మెజార్టీ సీట్లను స్వల్ప తేడాతో కోల్పోయింది. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు ముందు నుంచే శ్రేణులను కార్యోన్ముఖులను చేసేందుకు సిద్ధమైంది. నిజానికి ఏ పార్టీకి లేనంత బలం బీఆర్ఎస్‌కు ఉండగా, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే లోకసభఎన్నికల్లో విజయం తథ్యం అవుతుందన్న అభిప్రాయాలున్నాయి.

వైఫల్యాలను ఎండగట్టేలా..

నిజానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కన్నా.. బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేయడానికి ఎక్కువ సమ యం కేటాయిస్తున్నది. క్షేత్రస్థాయిలో వివిధ వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఆ దిశగా దృష్టి పెట్టడం లేదని తెలుస్తున్నది. గత పదేళ్ల కేసీఆర్ సర్కారు పాలనలో మొగులు మొఖం చూడాల్సిన పరిస్థితి లేదు. కానీ, కాంగ్రెస్ వచ్చిన కొద్ది రోజుల్లోనే సాగునీటి కొరత ఏర్పడింది. ఇప్పటికే ఎస్సారెస్పీ చివరి కాలువలకు నీరందడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందలాది ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల పొలాలు నెరెలు వారుతున్నాయి. చాలా ప్రాంతాల్లో నాట్లు వేయక నారు ముదిరిపోతున్నది. గంగాధర మండలంలో కొంతమంది తమ వరి పంటను కాపాడుకునేందుకు మళ్లీ బావులు తవ్వుతున్నారు. కేసీఆర్ సర్కారు పాలనలో వ్యవసాయ బావుల వద్ద క్రేన్లు కనిపించలేదు కానీ, ఇప్పుడు మళ్లీ బావులు తవ్వుకునే పరిస్థితి ఏర్పడుతున్నది. ఇదే కాకుండా.. ఇప్పటికే ఎల్ఎండీ దిగువన వారబందీ అమలు చేస్తున్నారు. కానీ, గొప్పలు చెప్పుకోవడానికి కాకతీయ కెనాల్ ద్వారా నల్గొండ వరకు నీళ్లు ఇస్తున్నట్టు లెక్కలు చూపుతున్నారు. కరెంటు విషయంలో విచ్చలవిడిగా ట్రిప్ అవుతున్నది. రైతుభరోసా కింద నేటికీ రైతు ల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. అడిగితే చెప్పుతో కొట్టాలంటూ కాంగ్రెస్ నాయకులు దురుసుగా మాట్లాడుతున్నారు. అలాగే, అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రైతులకు ₹2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఆ దిశగా ఆలోచన లేదు. అభయహస్తం గ్యారెంటీల అమలులోనూ అదే పరిస్థితి ఉంది. తెల్ల రేషన్‌కార్డులకు దరఖాస్తులు తీసుకున్నా కంప్యూటరీకరణ చేయలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూణ్ణాళ్లకే సాంచాలు మూత పడ్డాయి. కేటీఆర్ డిమాం డ్ మేరకు తిరిగి ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడంతో మళ్లీ సాంచాలు మొదలయ్యాయి. ఇలా లోతుగా చూస్తే అనేక లొసుగులు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను చూస్తే 420 హామీలున్నాయి. హామీలు ఇచ్చినంత శ్రద్ధగా.. వాటిని అమ లు చేసే విషయంలో మాత్రం దృష్టి పెట్టడం లేదు. ఇవిపోగా.. తిరి గి గత కేసీఆర్ సర్కారును విమర్శించడమే పనిగా కాంగ్రెస్ ముం దుకుసాగుతున్నది. ఈ నేపథ్యంలో ప్రజల పక్షాన నిలబడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగుతూ.. వాస్తవాలను ప్రజల ముందుంచుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ సమావేశాలు నిర్వహిస్తున్నది. అందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మార్గదర్శనంలో శ్రేణులను తీర్చిదిద్దుతున్నది.

నేడు సిరిసిల్లలో సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు గులాబీ సైన్యాన్ని సన్నద్ధం చేసే లక్ష్యంతో బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాలను శనివారం నుంచే ప్రారంభించింది. ఆదివారం సిరిసిల్లలో నిర్వహించనుండగా, అందుకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ వద్ద భారీ ఏ ర్పాట్లు చేస్తున్నది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై, గులాబీ సైన్యానికి దిశానిర్దేశం చేయనున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ దేశ్‌పతి శ్రీనివాస్ పాల్గొననున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని తంగళ్లపల్లి, సిరిసిల్ల, గంభీరావుపేట, ముస్తాబా ద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పెద్దసం ఖ్యలో తరలి రానున్నారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు.

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి

బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

- నాయకులు మండలాలు, మున్సిపాలిటీల్లో పర్యటించాలి
- కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధిని వివరించాలి
- కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కార్పొరేషన్, జనవరి 27: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ కరీంనగర్ పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోని 40 మండలాలు, మున్సిపాలిటీల్లో పర్యటించి ప్రజలను కలువాలని దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, అం దిన సంక్షేమ ఫలాలను వివరించాలని సూచించారు. శనివారం నగరంలోని బీఆర్ఎస్ క్యాంపు ఆఫీసులో నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాల్సిన అవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఒరిగేదేమీ ఉండదని, ఇంటి పార్టీతోనే ఈ ప్రాంతానికి మేలు జరుగుతుందనే విషయాన్ని విడమరిచి చెప్పాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, తోట ఆగయ్య, ముఖ్య నాయకులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, సిద్ధం వేణు, పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జక్కుల నాగరాజు యాదవ్, దూలం సంపత్ గౌడ్, తిరుపతి నాయక్, పూర్ణచందర్, కేమసరం తిరుపతి, పర్శరాం, మధు, సాయికృష్ణ, సికిందర్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో తెలంగాణ ఆదర్శం



సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దంపతులు సంజయ్‌కుమార్, రాధిక, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్

- సర్పంచులు, ఉప సర్పంచుల పనితీరు అభినందనీయం
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, జనవరి 27: 'పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు. గ్రామాల అభివృద్ధి, పచ్చదనం పరిశుభ్రతలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దే' అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కొనియాడారు. సర్పంచుల, ఉప సర్పంచ్‌ల పదవీకాలం జనవరి 31తో ముగుస్తున్న నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ గార్డెన్స్‌లో జగిత్యాల నియోజకవర్గ సర్పంచులు, ఉప సర్పంచ్‌లను ఎమ్మెల్యే దంపతులు సంజయ్ కుమార్, రాధిక, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ సత్కరించారు. అనంతర వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేసీఆర్ నిరంతరం కృషి చేశారన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో జిల్లానురెండో స్థానంలో నిలుపడంలో సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధుల పాత్ర చాలా గొప్పదని ప్రశంసించారు. సర్పంచులు పదవీకాలం పూర్తయినా ప్రజా జీవితంలో సేవ చేస్తూ ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను సర్పంచులు, ఉప సర్పంచులు సన్మానించారు. కార్యక్రమంలో అన్ని మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు చెరుకు జాన్, గోడిసెల గంగాధర్, గుర్రాల రాజేందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, అనుపురము శ్రీనివాస్, ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్ గౌడ్, మహేశ్, మండల పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, జిల్లా ఆర్‌టీఏ మెంబర్ సుధాకర్ రావు తదితరులు ఉన్నారు.

ఎండుతున్న పంటలను కాపాడాలి

- 'నారాయణపూర్'కు నీటిని విడుదల చేయాలి
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- కుర్మపల్లిలో ఎండిన పంట పొలాల పరిశీలన

గంగాధర, జనవరి 27: నారాయణపూర్ జలాశయానికి ఎల్లంపల్లి నీటిని విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నదని విమర్శించారు. నమ్మి ఓటేసిన పాపానికి నట్టేట ముంచిందని దుయ్యబట్టారు. గంగాధర మండలం ర్యాలపల్లి పంచాయతీ పరిధిలో కుర్మపల్లిలో ఎండిపోయిన పంట పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుంకె మాట్లాడారు. చొప్పదండి నియోజకవర్గ రైతులు నారాయణపూర్ రిజర్వాయర్‌ను నమ్ముకొని వరి సాగు చేస్తున్నారని చెప్పారు. కేసీఆర్ పాలనలో సాగుకు సరిపడా నీరందించడంతో రైతులు బంగారు పంటలు పండించారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ సర్కారును నమ్మి నాటేసిన రైతులు ఇప్పుడు నీరందక ఎండిపోయే పరిస్థితి వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 50 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు రైతుబంధు రాలేదని, రుణమాఫీ చేయలేదన్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ నేత మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని చూస్తే రైతులకు వారిపై ఉన్న ప్రేమ ఇట్టే తెలుస్తున్నదన్నారు. పదిహేను ఏండ్ల క్రితం కాంగ్రెస్ పాలనలో అనేక మంది రైతులు ప్రాణాలు తీసుకున్నారని, ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి స్పందించి రెండు రోజుల్లో నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటి విడుదలకు చర్యలు చేపట్టాలన్నారు. లేదంటే రైతులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఇక్కడ ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, నాయకులు దానె ఓదెలు, దూలం శంకర్‌గౌడ్, ఐలయ్య ఉన్నారు.

కుర్మపల్లి వద్ద ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

నృత్యం చేస్తున్న వైద్య విద్యార్థులు

మెడికోల ప్రెషర్స్ డే హంగామా

కొత్తపల్లి, జనవరి 27 : కొత్తపల్లిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రెషర్స్ డే వేడుకలు శనివారం రాత్రి ఉత్సాహంగా సాగాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు బస్సులు, ఏసీ, జనరేటర్ సౌకర్యం కల్పించాలని అధికారులతో కలిసి విద్యార్థులు మంత్రి పొన్నంకు వినతిపత్రం అందించారు. స్వతహాగా డాక్టర్ అయిన కవ్వంపల్లి సత్యనారాయణకు మెడికల్ కాలేజీ ఇబ్బందులను పరిష్కరించే బాధ్యతను అప్పగిస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శీల లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ఒక వైపే పూత

మల్యాల మండలంలోని నూకపల్లి గ్రామశివారులో గల ఓ రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలోని మామిడి చెట్టుకు ఒకవైపే పూత పూసింది. యూపీ దశరి జాతికి చెందిన మామిడి చెట్టు తనలోని ఒక సగ భాగం మాత్రమే విరగబూయడంతోపాటు మరో సగభాగం వైపు మాములుగానే ఉండడం పలువురిని ఆశ్చర్యపరుస్తున్నది.

–మల్యాల, జనవరి 27



నూకపల్లి శివారులో మామిడి చెట్టుకు ఒకే వైపు కనిపిస్తున్న పూత

ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్త

టీఎన్జీవోస్ 2024 డైరీ ఆవిష్కరణలో మంత్రి పొన్నం ప్రభాకర్

టీఎన్జీవోస్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లి, ఉద్యోగులు

కొత్తపల్లి, జనవరి 27 : ప్రభుత్వోద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో తాను ఎప్పుడూ ముందుంటానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో ఫంక్షన్‌హాల్ శనివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీఎన్జీవోస్ 2024 డైరీ ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న జోనల్ సమస్య, జిల్లాల విభజన, 317 జీవో ఇతర సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైకో వీరంగం

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 27 : గోదావరిఖని పట్టణంలోని ఎల్‌బీనగర్ సెంటర్‌లో శనివారం రాత్రి ఓ సైకో వీరంగం సృష్టించాడు. స్థానికంగా ఉన్న పలువురి పైకి దాడికి ప్రయత్నించడంతో స్థానికులు అతన్ని పట్టుకొని విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాధారు. అనంతరం గోదావరిఖని వన్‌టౌన్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని, అతడిని చికిత్స కోసం దవాఖానకు తరలించారు.

కవ్వంపల్లికి చుక్కెదురు

- సొంత గ్రామం పచ్చునూర్‌కు చెందిన సింగిల్ విండో చైర్‌పర్సన్‌పై వీగిన అవిశ్వాసం
- బీఆర్ఎస్ మద్దతుదారుడిదే కుర్చీ

మానకొండూర్ రూరల్, జనవరి 27 : ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు చుక్కెదురైంది. ఆయ న సొంత గ్రామం పచ్చునూర్‌కు చెందిన సింగిల్ విండో చైర్‌పర్సన్‌పై ఆయన ముఖ్య అనుచరుడైన సింగిల్‌విండో డెరెక్టర్, మరికొందరితో కలిసి పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. వివరాల్లోకి వెళితే.. మానకొండూర్ మండలం దేవంపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్‌పర్సన్‌గా పచ్చునూర్‌కు చెందిన చైర్‌పర్సన్ కసిరెడ్డి లత కొనసాగుతున్నారు. ఆమె బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలిచారు. సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉన్నా రు. అయితే, ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడిగా ఉన్న సింగిల్ విండో డెరెక్టర్, మరో 8 మంది డెరెక్టర్లతో కలిసి చైర్‌పర్సన్‌పై గత డిసెంబర్ 30న అవిశ్వాసం కోసం అధికారులకు నోటీసులు అందజేశారు. ఈ క్రమంలో శనివారం అధికారులు అవిశ్వాస తీర్మానానికి సొసైటీ ఆవరణలో ఏర్పాట్లు చేశారు. నిర్ణీత సమయానికి డీసీఓ రామానుజాచార్యులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కరన్‌కుమార్, శైలజ, సీఈఓ మల్లికార్జునరెడ్డి సొసైటీ వద్దకు వచ్చారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేచి చూశారు. అయితే, డెరెక్టర్లు అందరూ గైర్హాజరుకావడంతో అవిశ్వాసం వీగినట్లు ప్రకటించారు. చైర్‌పర్సన్ కసిరెడ్డి లతనే కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. అయితే, ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు పెట్టిన అవిశ్వాసం వీగిపోవడంతో సొంత గ్రామంలోనే కవ్వంపల్లికి చుక్కెదురైనట్లయింది.

వేడుకలు ప్రారంభిస్తున్న చైర్మన్ శ్రీనివాస్ రావు

జోరుగా..హుషారుగా..

ఘనంగా సాధన స్కూల్ వార్షికోత్సవం

కమాన్‌చౌరస్తా, జనవరి 27: జిల్లా కేంద్రంలోని జ్యోతి నగర్ సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో శనివారం 20వ వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. పాఠశాల చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్‌రావు, అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ నీలిమ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, 20 ఏండ్ల పాఠశాల ప్రస్థానంలో అనేక మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దామని చెప్పారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్ వి.కుమారస్వామి, హెచ్ఎం ధనలక్ష్మి ఉన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థులు